భూమికి సారం.. రైతుకు వరం

- పచ్చిరొట్ట పైర్లతో అనేక ప్రయోజనాలు
- ఎకరం చేలలో రెండు టన్నుల ఎరువు లభ్యం
- అన్నదాతకు అదనపు ఆదాయం



ఖండవల్లిలో జనుము పంట

పెరవలి: పచ్చిరొట్ట పైర్ల పెంపకంతో చేలకు రెండు టన్నుల భూసారం లభిస్తుంది. పదేళ్ల క్రితం దాళ్వా పంట కోసిన తర్వాత మినుము, పెసలతో పాటు, పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్ల పంటలను సాగు చేసేవారు. ఈ పచ్చి రొట్ట పంట ద్వారా భూసారం పెరిగి, సార్వా పంటకు మంచి పోషణ లభించేది. కాలక్రమేణా ఈ పంటలపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో భూములు నిస్సారంగా మారాయి. ఇదే క్రమంలో ఎరువుల వినియోగం అధికమవ్వడంతో పంట భూములు చౌడు బారుతున్నాయి. ఉద్యాన, వ్యవసాయ అధికారులు పంట భూములపై రైతులకు అవగాహన కల్పించడానికి పలు ప్రయోగాలు చేయడంతో పాటు, భూసార పరీక్షలు, పొలంబడి వంటివి నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు రైతులు పచ్చిరొట్ట సాగు చేపట్టారు. ఖండవల్లిలో మెట్ట భూముల్లో వేసిన జనుము పంట పెరగడంతో, వాటిని కోసి చేలల్లోనే వదిలి వేస్తున్నారు. దుక్కుదున్ని తడి అందించిన తర్వాత పంట కుళ్లి భూసారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

కొవ్వూరు డివిజన్ పరిధిలో 7,500 ఎకరాల్లో పచ్చిరొట్ట సాగు చేపట్టారు. ఇందులో నిడదవోలు నియోజకవర్గంలో 2,800 మంది రైతులు సుమారు 3,500 ఎకరాల్లో ఈ పంటలు వేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2,500 నవధాన్యాల కిట్లు పంపిణీ చేసి, పచ్చిరొట్ట పైర్లు సాగు చేయిస్తున్నారు. దీనివల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరటంతో పాటు, చేలకు టన్నులకొద్దీ ఎరువు లభిస్తోంది. ముఖ్యంగా నిడదవోలు నియోజకవర్గంలో చేపలు, రొయ్యల చెరువులతో వెలువడే వ్యర్థాల వల్ల పంట భూములు సారం కోల్పోతున్నాయని, వీటి నుండి రక్షణకు పచ్చిరొట్ట పైర్ల సాగు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

చౌడు భూములకు మేలు

పంట భూములను సారవంతం చేయడంలో పచ్చిరొట్ట పైర్లు కీలక పాత్ర పోషిస్తాయి. పచ్చిరొట్ట పైర్లలో పిల్లిపెసర, జనుము, జీలుగ ప్రథమ స్థానంలో ఉంటాయి. చౌడుబారిన భూములను యథాస్థితికి తెస్తుంది జీలుగ పంట. భూమిలో చౌడుబారే లక్షణాలను స్వీకరించి, వేర్ల ద్వారా బుడిపెలను తయారు చేసి, తద్వారా భూమిని సారవంతం చేస్తాయి. పచ్చిరొట్ట పంట వేశాక 45 రోజులు ఉంచి, తర్వాత మురుగు దమ్ము చేస్తే, ఆ భూమిని తర్వాత పంటకు ఎంతో మేలు చేస్తుంది. జీలుగ పంట ప్రతి రైతు ఏడాదిలో ఒకసారి వేస్తే, భూమి చౌడుబారేతనాన్ని విడనాడుతుంది. పచ్చిరొట్ట పైర్లను పెంచితే పంటకు ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదు. ఉప్పునీటి, రొయ్యల చెరువుల ద్వారా విడుదలయ్యే నీటితో భూములు కలుషితమవుతున్నాయి. అటువంటి భూముల్లో జీలుగ పంటను వేస్తే చౌడుబారేతనాన్ని నివారిస్తుంది.

రెండు టన్నుల ఎరువు

పిల్లిపెసర, మినుము, పెసర పంటల వల్ల పప్పు ధాన్యాలు అందించటమే కాకుండా, పంటకు భూసారాన్ని అందిస్తుంది. ఆయా పంటలు ఎకరం చేలలో వేస్తే, అది భూమికి రెండు టన్నుల ఎరువును అందిస్తుంది. దీనివల్ల సార్వాలో వేసే పంటకు మంచి బలం చేకూర్చి, మంచి దిగుబడులు ఇవ్వడానికి దోహదం చేస్తుంది. ఈ పంటలు వేసినప్పుడు, పప్పులను కోసి, మొక్కలను అలా వదిలివేయాలి, ఆ తర్వాత నీరు పెట్టి దమ్ము చేస్తే, భూమికి మంచి సారం అందుతుంది. పప్పు ధాన్యాలు ఎకరానికి రెండు నుంచి మూడు బస్తాలు అందుతాయి.


భూసారం.. అదనపు ఆదాయం



పచ్చిరొట్ట పైర్ల ద్వారా పంట భూములకు భూసారం పెరిగి, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. కొత్త పంటకు మేలు జరుగుతుంది. మెట్టలో సార్వా కోతల తర్వాత జనుము, పిల్లిపెసర, జీలుగ, మినుము, పెసర వంటివి సాగు చేస్తారు. డెల్టా ప్రాంతంలో దాళ్వా ముగిశాక ఈ పంటలు సాగు చేపడతారు. ఈ పంటల వల్ల ఎకరానికి రెండు టన్నుల భూసారం లభిస్తుంది.

– పి.చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావాలి



బంగారమ్మపేటలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సరస్వతి

కొవ్వూరు: అసంఘటిత కార్మికులు ఈ–శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేయించుకుంటే, బీమా సదుపాయం పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అన్నారు. మండలంలోని బంగారమ్మపేట గ్రామంలో మంగళవారం అసంఘటిత కార్మికులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల ఏడు వరకు అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ–శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేయించుకుని ఏడాది దాటిన వాళ్లు స్థానిక సచివాలయాల్లో రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని వారు మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సాయం పొందవచ్చని చెప్పారు. కార్మిక హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయవాది ఎస్‌బీ కాంతిధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధితురాలికి ఆర్థిక సాయం

తాళ్లపూడి: అన్నదేవరపేటలో శనివారం కురిసిన వర్షాలకు బొర్రా వీరలక్ష్మి పెంకుటింటిపై పిడుగు పడి ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో వీరలక్ష్మి శరీరం 70 శాతం కాలిపోయింది. ఆమె ప్రస్తుతం రాజమండ్రి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను మంగళవారం తహసీల్దార్ మోహనభారతి పరామర్శించారు. రూ.8 వేల ఆర్థిక సాయం అందించి, బాధితురాలి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, తగిన న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. సంఘటనపై వీఆర్వో కావూరి నాగేశ్వరరావు ఇచ్చిన నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. త్వరలో ఆమె కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితురాలికి అందించేందుకు ఆర్థిక సాయం సేకరిస్తున్నామని ఏఎస్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. వీరితో పాటు, వీఆర్వోలు సంజీవరావు, ఇబ్రహీం, ఎం.ప్రకాష్, కావూరి నాగేశ్వరరావు ఉన్నారు.

పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలుకు చర్యలు

నిడదవోలు రూరల్: రబీలో పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు అధైర్యపడొద్దని, ఆర్‌ఎస్‌కేల్లో కొనుగోలు లక్ష్యాలను పెంచుతున్నామని చెప్పారు. ఎంపీడీఓ బి.లక్ష్మీనారాయణ, ఏఓ జి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ మాధవన్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

డా.జొన్నకూటికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రమోద్‌కుమార్

తాళ్లపూడి: పైడిమెట్ట గ్రామానికి చెందిన కవి, రచయిత, హెచ్‌ఎం డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్ డా.ఎన్టీఆర్ కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలో ఇటీవల జరిగిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ నుంచి ఆయన ఈ అవార్డు స్వీకరించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సామాజిక సేవా రంగంలో ప్రసిద్ధి చెందిన దాదాపు 30 మందికి ఈ పురస్కారం అందించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలు

దేవరపల్లి: రెండు రోజులుగా జరుగుతున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలు బుధవారం ముగియనున్నాయి. మంగళవారం అమ్మవారికి, స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి స్వామివారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ, కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సంయుక్తాధ్వర్యంలో మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

కొవ్వూరు: నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం ఇక్కడ విలేకరులకు వెల్లడించారు. పశివేదల నుంచి ఆరికిరేవుల ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.2.30 కోట్లు, పెనకన మెట్ట నుంచి కుమారదేవం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. చాగల్లు మండలంలో డ్రైన్ల నిర్మాణానికి రూ.28.50 లక్షలు జెడ్పీ నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆయా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు.

ఆశా వర్కర్లదే కీలక పాత్ర

ఉండ్రాజవరం: గర్భిణులకు వైద్య సాయం అందించడంలో ఆశా కార్యకర్తలదే కీలక పాత్ర అని వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యులు ఇర్ఫాన్ అన్నారు. మండలంలో వేలివెన్ను పీహెచ్‌సీలో డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ సృజన అధ్యక్షతన మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను త్వరితగతిన గుర్తించి, వారికి సకాలంలో వైద్యం అందించడంలో ఆశా కార్యకర్తల పాత్రను వివరించారు. ఈ సందర్భంగా ఈఈ–ఆశా యాప్‌లో మార్పులపై వారికి శిక్షణ ఇచ్చారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో బుధ, శని వారాల్లో గర్భిణులకు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. పెరిగిన ఉష్ణోగ్రతల నుంచి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఓఆర్‌ఎస్ ద్రావణంపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పర్యవేక్షకురాలు కె.సుభాషిణి, హెల్త్ అసిసెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీని పటిష్టపర్చాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు



ధర్మవరం సమావేశంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు, అనుబంధ కమిటీల నియామకం ద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మంగళవారం రాత్రి కాపవరం, ధర్మవరం గ్రామాల్లో కమిటీ సమావేశాలు నిర్వహించారు. గ్రామ స్థాయి కమిటీలు రానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు పనిచేయాలని సూచించారు. కాపవరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చౌటుపల్లి తాతరావుని, ధర్మవరం గ్రామానికి జాలాది రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఆయా గ్రామాల్లో పార్టీ పరిస్థితి, నాయకత్వం భవిష్యత్తు కార్యక్రమాల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంపాటి సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఆయా సమావేశాల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు(అబ్బులు), పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమానుల్లాబేగ్, ఎండీ మజారుల్లా బేగ్, జిల్లా ప్రచార విభాగం మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, మరపట్ల శ్రీనివాస్, బొప్పన కృష్ణ, కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు

పెరవలి: రాష్ట్రంలో రెండో ద్వారకా తిరుమలగా పేరొందిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం నుండి ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఎనిమిదో తేదీన ఏకాదశి గురువారం వివిధ పూజలు, ఉత్సవాలు, స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలను చేస్తామని, అనంతరం కల్యాణం నిర్వహిస్తామని వివరించారు. తొమ్మిదిన సుదర్శన హోమం, సామూహిక కల్యాణోత్సవం, పదిన సామూహిక కల్యాణోత్సవం, 11న సామూహిక తులసీ బృందార్చన, 12న సామూహిక కుంకుమార్చన, చక్రస్నానం, సాయంత్రం ఏకాంత సేవ, పుష్పోత్సవం, పవళింపు సేవ జరుగుతాయన్నారు. ఆయా రోజుల్లో భక్తులకు ఉచిత అన్న సమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు. నిత్యం భజన బృందాలు, కోలాటాలు, సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వివరించారు.



అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం

మదన గోపాలస్వామి కల్యాణానికి ఏర్పాట్లు

నిడదవోలు: పట్టణ నడిబొడ్డున ఉన్న మదన గోపాలస్వామి ఆలయంలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న రుక్మిణీ, సత్యభామ సమేత మదన గోపాలస్వామి కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 12న సాయంత్రం 6.30కు రుక్మిణీ, సత్యభామ సమేత మదనగోపాలస్వామి వార్లకు దివ్య కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు, అర్చకులు గోవర్ధనం దుర్గప్రసాదాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారు, అమ్మవార్లకు సహస్రనామ పూజలు, విష్ణు, లక్ష్మీ సహస్ర నామ పారాయణం, అమ్మవారికి కుంకుమ పూజలు, గ్రామోత్సవం, భరతనాట్య ప్రదర్శనలు జరుగుతాయి. 12న అన్నమాచార్య జయంతి సందర్భంగా అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నారు. కల్యాణం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.



రుక్మిణీ, సత్యభామ సమేత మదన గోపాలస్వామివారు

ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు సహకరించాలి

– మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు: వర్షాలతో ధాన్యంలో తేమ శాతం పెరిగిందని రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు రైతులకు సహకరించాలన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సాధారణంగా 17 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి, నిర్ణీత వ్యవధిలో రైతుల ఖాతాలో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తేమ శాతం పెరిగితే ధాన్యం కొనుగోలు చేయబోమన్న అపోహలు రైతులు నమ్మవద్దన్నారు. రైతుల నుంచి ఏ రకమైన ధాన్యాన్నయినా సేకరించి తీరాలని, దీనిపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. త్వరలోనే రైతుల ఖాతాల్లో రూ.20 వేల నగదు జమ చేసే పథకాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. ధాన్యం సేకరణలో నిడదవోలు నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు. పంట దిగుబడి ఎక్కువ కావడంతో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచామన్నారు. నిడదవోలు మండలంలోనే 43,229 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఇది రాష్ట్రంలోనే అత్యధికమన్నారు. ఉండ్రాజవరంలో 23,223, పెరవలిలో 21,234 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు.

225 యూనిట్లకు ప్రతిపాదనలు

మత్స్య శాఖకు సంబంధించి 255 యూనిట్లకు రూ.1.27 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు(మొబైల్), రోజుకు 20 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పెద్ద మిల్లుల ఏర్పాటు, సంప్రదాయ మత్స్యకారులకు పడవలు, వలలు అందించడం, ఐస్ బాక్స్‌లతో కూడిన సైకిల్, మోటార్ సైకిల్, బయోఫ్లాక్ కల్చర్ వ్యవస్థ ఏర్పాటు, రిజర్వాయర్లలో ఫింగర్ లింక్స్ నిల్వ చేయడం, చేపపిల్లల పెంపకం వంటి ఏడు రకాల పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. మంత్రి వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ఏఎస్‌వోఎం నాగాంజనేయులు, ఏడీఏ పి.చంద్రశేఖర్, ఏవో సత్యనారాయణ తదితరులున్నారు.

9న జాబ్‌మేళా

నిరుద్యోగ యువతకు ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించడం కోసం ఈ నెల 9న స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్ మేళాలో 1,302 మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. 45 కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. టెన్త్ నుంచి వివిధ కోర్సుల్లో పాసైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గురునాథానికి సత్కారం

తాళ్లపూడి: రాష్ట్ర కాపు జేఏసీ మెంబర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథం పార్టీ మచిలీపట్నం పార్లమెంటరీ పరిశీలకులుగా ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు జేఏసీ మెంబర్, పార్టీ నాయకుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు జంగారెడ్డిగూడెంలోని గురునాథం స్వగృహంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు, పార్టీ జిల్లా యాక్టివ్ సెక్రటరీ వంబోలు పోసిబాబు, కాపు సంఘం మండల అధ్యక్షుడు నామ ప్రకాశం, నాయకులు చింతా వెంకటస్వామి, కోడి గంగారావు తదితరులున్నారు.



గురనాథాన్ని సత్కరిస్తున్న నాయకులు

పౌష్టికాహారం పంపిణీ

కొవ్వూరు: వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని అన్నారు. మంగళవారం స్థానిక అచ్చాయమ్మ కాలనీలో 300 మంది పేదలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. క్లబ్ రీజియన్ చైర్మన్ ఆలపాటి అచ్యుతలక్ష్మి, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

దేవరపల్లి: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు దేవరపల్లిలో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, తిరుమంజనం, తిరువీధి ఉత్సవం, ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ, ఉత్సవమూర్తులకు అభిషేకం, మంగళశాసనం, సాయంత్రం గరుడవాహన ఉత్సవం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపకాంతులతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామివారిని విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గరుడ వాహన సేవలో పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం, టీటీడీ కళాకారుల బృందం వారి అన్నమాచార్య సంకీర్తన స్వరాభిషేకం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, సభ్యులు తెలిపారు.



దేవరపల్లిలో గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

పెండింగ్ భూ సమస్యలకు పరిష్కారం

– ఆర్డీఓ రాణి సుస్మిత



గుడ్డిగూడెంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

గోపాలపురం: కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న భూముల పరిష్కారానికి 22ఏ నుండి తొలగించుటకు రైతులకు రెవెన్యూ శాఖ అవకాశం కల్పించిందని కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం, గోపవరం గ్రామాలలో మంగళవారం పెండింగ్‌లో ఉన్న భూముల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గతంలో ఆర్‌అండ్‌ఆర్ ద్వారా ఎన్నో భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, రెవెన్యూ శాఖ ద్వారా ఆర్‌అండ్‌ఆర్‌ను 22ఏ చట్టబద్ధం చేసినట్లు చెప్పారు. రైతులకు సంబంధించిన భూ హక్కుపత్రాలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయాలని, తద్వారా వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తారన్నారు. భూములకు రికార్డులు ఉండి, అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్న రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ కె.అజయ్‌బాబు, మండల సర్వేయర్ ఎం.తులసి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నల్లజర్ల: ముందు ప్రయాణిస్తున్న కారును బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు ఓవర్ టేక్ చేయబోయి ప్రమాదానికి గురయ్యారు. ఏలూరు జిల్లా కన్నాపురం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న ఈ యువకులు ప్రకాశరావుపాలెం శివార్లలో అదుపు తప్పి బైక్‌తో కారును ఢీకొన్నారు. తీవ్ర గాయాలైన వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు

పీఎంపీలు ప్రాథమిక వైద్యమే చేయాలి

పెరవలి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యం నిర్వహించే ఆర్‌ఎంపీలు, పీఎంపీలు రోగికి కేవలం సలహాలు మాత్రమే ఇచ్చి, మందులు అందించవచ్చని ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు పి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం పీఎంపీలు, ఆర్‌ఎంపీల మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తణుకుకు చెందిన ఆరోగ్య ఆసుపత్రి వైద్యులు వైద్య విజ్ఞాన తరగతులు నిర్వహించారు. ఆసుపత్రి ఎండీ చైతన్య మాట్లాడుతూ, వాతావరణంలో వచ్చిన మార్పులు, తీసుకున్న ఆహారంతో రోజురోజుకూ వివిధ రకాల రోగాలు వస్తున్నాయన్నారు. రోగి పరిస్థితిని గమనించి, ప్రాథమిక చికిత్స అందించి, అందుబాటులో ఉండే ఆస్పత్రులకు తరలించాలన్నారు. ఒక్కోసారి ఆలస్యం చేస్తే రోగి ప్రాణాలకే ముప్పు వాటిల్లవచ్చని చెప్పారు. వైద్యురాలు పావని మాట్లాడుతూ, గర్భం దాల్చిన మహిళలకు ఎటువంటి ఇంజెక్షన్లు ఇవ్వరాదని, అది కూడా అనుభవ వైద్యుల సూచనల మేరకే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా నేరుగా ఇస్తే గర్భస్రావమయ్యే పరిస్థితి ఉంటుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీలు మండల అధ్యక్షుడు ఆగర్తి వెంకట కృష్ణారావు, కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నిడదవోలు: పట్టణంలో ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12 నుండి 45 రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.జ్యోతి మంగళవారం తెలిపారు. నిరుద్యోగులతో పాటు, గృహిణులకు ఆఫీస్ అసిస్టెంట్ (కంప్యూటర్ శిక్షణ), కమ్యూనికేషన్ స్కిల్స్, టైపింగ్, ఇంటర్నెట్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. 16 నుండి 38 ఏళ్ల లోపు, పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులేనన్నారు. వివరాలకు 96760 52454, 91217 14649 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సారా విక్రేత అరెస్ట్

నల్లజర్ల: చాదరాశిగుంటలో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్టు దేవరపల్లి ఎక్సైజ్ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. చాదరాశిగుంట గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, సారా విక్రయిస్తున్న నాయుడు వెంకటలక్ష్మిని ఐదు లీటర్ల సరకుతో అరెస్టు చేసినట్టు చెప్పారు. దాడుల్లో సీఐతో పాటు, సిబ్బంది పాల్గొన్నారు.